ప్రజాశక్తి
సోమవారం 15 జూలై, 2024 5
శ్రీకాకుళం

నేడు సదస్సు

శ్రీకాకుళం : స్వాతంత్ర్య సమరయోధుడు గరిమెళ్ల సత్యనారాయణ జయంతిని పురస్కరించుకుని గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన 'పోటీ పరీక్షల్లో అవకతవకలు-ప్రభుత్వ విధానాలు-యువత కర్తవ్యం' అంశంపై సోమవారం సదస్సు నిర్వహిస్తున్నట్లు కేంద్రం అధ్యక్షులు వి.జి.కె మూర్తి ప్రకటనలో తెలిపారు. మహిళా డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సదస్సులో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.ప్రభాకరరావు, జెమ్స్ వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్, ప్రజారోగ్య వేదిక అధ్యక్షులు డాక్టర్ ఆర్.మల్లేశ్వరరావు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు వక్తలుగా హాజరు కానున్నట్లు తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంశాపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువజనులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యారంగ, సామాజికవేత్తలు పాల్గొంటారని తెలిపారు.

ఆగిన అనుసంధాన పనులు

- భూసేకరణ బిల్లుల పెండింగ్‌తో నిలిచిన కాలువ తవ్వకాలు
- అర్ధాంతరంగా పనులు వదిలేసిన కాంట్రాక్టర్
- జూన్‌తో ముగిసిన ఒప్పంద కాలపరిమితి
- ఒప్పందం పొడిగింపునకు ఉన్నతాధికారులకు లేఖ

వంశధార-నాగావళి నదుల అనుసంధాన పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం ప్రాధాన్యతా ప్రాజెక్టుగా గుర్తించామని చెప్పినా, ప్రాజెక్టు పూర్తి చేయడంలో ఆ రకమైన శ్రద్ధ కనబరచలేదు. దీంతో ఇప్పటికీ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఒప్పందం ప్రకారం ఈ ఏడాది జూన్ నాటికి పూర్తి కావాల్సి ఉంది. పనులు పూర్తి కాకపోవడంతో, మరోసారి ఒప్పంద కాలపరిమితిని పొడిగించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఇందుకు అనేక కారణాలు కనిపిస్తున్నాయి. కాలువ తవ్వకాలకు సేకరించిన భూములకు చెల్లింపులు చేయకపోవడమే జాప్యానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. కాలువ తవ్వకాలకు కొన్నిచోట్ల కోర్టు కేసులూ ఉండడం మరో కారణంగా ఉంది. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో అర్ధాంతంగా పనులు ఆపేశారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

బూర్జ మండలం కొల్లివలస, సింగన్నపాలెం మధ్య అసంపూర్తిగా హైలెవల్ కెనాల్ పనులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార, నాగావళి నదుల అనుసంధానంలో భాగంగా హిరమండలం రిజర్వాయర్ గట్టుకు రెండు తూములు ఏర్పాటు చేసి అక్కడ నుంచి 33.58 కిలోమీటర్ల మేర నారాయణపురం వరకు కాలువ తవ్వాల్సి ఉంది. హిరమండలం వద్ద నీటిని సరఫరా చేసే చోట 43.7 మీటర్ల స్థాయిలో, నారాయణపురం ఆనకట్ట వద్ద కాలువ కలిసే చోట 29.09 మీటర్లు నిర్మించేలా డిజైన్ చేశారు. తద్వారా ఏటవాలుగా నీరు ప్రవహించి ఆనకట్టకు చేరుతుంది. నదుల అనుసంధానం పూర్తి చేస్తే ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో ఉన్న ఐదు వేల ఎకరాలకు సాగునీరందుతుంది. దీంతోపాటు నారాయణపురం ఆనకట్ట ప్రధాన కాలువల కింద ఉన్న 37,053 ఎకరాల ఆయుకట్టు స్థిరీకరణ జరుగుతుంది.

పెరిగిన ప్రాజెక్టు వ్యయం

వంశధార, నాగావళి నదుల పనులను రూ.84.90 కోట్ల వ్యయంతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 27, 2017లో పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. ప్రాజెక్టు పనులను నెల్లూరుకు చెందిన పి.వి రమణయ్య అండ్ కంపెనీకి రూ.57.99 కోట్లకు పనులను అప్పగించింది. అనుసంధాన పనులు 2020 నాటికే పూర్తి కావాల్సి ఉంది. పలుమార్లు ఒప్పంద కాలపరిమితిని పొడిగించినా పనులు పూర్తి కాలేదు. అంచనా వ్యయాన్ని సవరించి రూ.145.34 కోట్లకు పెంచింది. ఇప్పటివరకు రూ.85.71 కోట్లను వెచ్చించారు.

భూసేకరణ చెల్లింపుల్లో జాప్యం

హైలెవల్ కెనాల్ పనులకు సంబంధించి భూసేకరణ పూర్తయినా, ప్రభుత్వం నేటికీ రైతులకు డబ్బులు చెల్లించలేదని తెలుస్తోంది. కాలువ తవ్వకాలకు మరో 49.23 ఎకరాల భూమి అవసరమని అధికారులు గుర్తించారు. భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరించినా ప్రభుత్వం డబ్బులు ఇవ్వడం లేదు. ఇందుకోసం రూ.8.26 కోట్లు కావాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదని తెలుస్తోంది. అదీగాక వర్షాలు పడుతుండడం కూడా పనులు ముందుకు సాగడానికి కొంత ఆటంకంగా మారింది. కాంట్రాక్టర్‌కు రూ.కోటి మేర బకాయిలు చెల్లించపోవడంతో పనులు అర్ధాంతరంగా ఆపేసి వెళ్లిపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

కాలువ పనులకు అడ్డంకిగా కోర్టు కేసులు

బూర్జ మండలం చినలంకాంలో కాలువ నిర్మాణం కోసం దేవాదాయ, ధర్మాదాయశాఖకు చెందిన సుమారు 7.5 ఎకరాల భూమి అవసరమైంది. వంశధార అధికారులు పరిహారం కింద దేవాదాయ, ధర్మాదాయశాఖకు రూ.1.50 కోట్లు చెల్లించేశారు. భూముల్లో 13 మంది రైతులు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. చట్టం ప్రకారం పరిహారంలో 60 శాతం దేవాదాయ, ధర్మాదాయశాఖకు, 40 శాతం కౌలు రైతులకు ఇవ్వాల్సి ఉంది. కౌలు రైతులకు పరిహారం చెల్లింపునకు సిద్ధమవుతున్న తరుణంలో, ఆ భూములు ఆలయానికి ఇచ్చిన ధర్మదాత పరిహారం ఇవ్వాల్సి వస్తే తనకు ఇవ్వాలని, లేకుంటే దేవాదాయశాఖకు చెందాలంటూ కోర్టును ఆశ్రయించాడు. దీంతో బూర్జ మండలం చిన లంకాం పరిధిలో 700 మీటర్ల మేర కాలువ తవ్వకాలకు బ్రేక్ పడింది. నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గంలో కాలువ నిర్మిస్తామని అధికారులు చెప్తున్నారు. కొత్త ప్రభుత్వం చొరవ చూపి ఈ సమస్యలకు పరిష్కారం చూపితే వంశధార-నాగావళి అనుసంధానం పనులు త్వరితగతిన పూర్తయి రైతుల కల నెరవేరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సమావేశంలో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

23 నుంచి 'పొలం పిలుస్తోంది'

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

ఈనెల 23వ తేదీ నుంచి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కోటబొమ్మాళి మండలంలోని నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందులో భాగంగా ప్రతి మంగళ, బుధవారాలు వ్యవసాయ అధికారులు రైతుల వద్దకు వెళ్లి సాగుకు సంబంధించిన విషయాలను వివరించి అవగాహన కల్పిస్తారని తెలిపారు. గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్ (జిఎపి), భూసార పరిరక్షణ, భూసార పరీక్ష ఆధారంగా ఎరువుల వాడకం, రాయితీపై విత్తనాల సరఫరా, గ్రామస్థాయిలో విత్తనోత్పత్తి, వ్యవసాయ యాంత్రీకరణ, సేంద్రీయ వ్యవసాయం వంటి శాస్త్రీయ అంశాలపై ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పారదర్శకంగా రైతులకు సేవలు అందించాలని, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి రైతుల సమస్యలకు సూచనలు అందించాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్, ఎడి బి.వి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎమ్మెల్యే శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతు సంఘ నాయకులు

భూ యాజమాని అనుమతి లేకపోయినా, కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెలమల రమణ, పోలాకి ప్రసాదరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడానికి భూ యాజమాని సంతకం నిబంధన ఎత్తివేయాలని, కౌలు రైతులకు రైతుభరోసా, పంటల నష్టపరిహారం, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం ఇవ్వాలని కోరుతూ ఎపి కౌలు రైతుసంఘం ఆధ్వర్యాన ఎమ్మెల్యే గొండు శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో 60 శాతానికి పైగా భూమిని కౌలు రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. ఆరుగాలం కష్టపడి పనిచేసిన రైతు కుటుంబానికి ఏమీ మిగలడం లేదన్నారు. భూమిపై రైతులకు ఇచ్చే అన్ని రాయితీలు వాస్తవ భూహక్కుదారైన రైతుకు అందుతున్నాయని, భూమిపై కష్టపడి పనిచేస్తున్న కౌలు రైతు కుటుంబానికి బ్యాంకు రుణం గానీ రైతుభరోసా గానీ ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు గానీ దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల కౌలు రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. 2019కి ముందు వ్యవసాయ అధికారులు కౌలుదారుని గుర్తించి, గుర్తింపు కార్డులు ఇచ్చారని గుర్తు చేశారు. ఆ విధంగానే గ్రామసభ నిర్వహించి భూ యాజమాని సంతకం నిబంధన లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో వాసు తదితరులు ఉన్నారు.

గెజిట్ జిఓ ప్రతులు దహనం

ప్రజాశక్తి- టెక్కలి

సిపిఎస్ ఉద్యోగస్తులకు గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ తీసుకొస్తూ... టిడిపి కూటమి ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కురమాన దాలయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం జిఒ నంబరు 54 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం జిపిఎస్‌ని పరిశీలించి ఉద్యోగులకు న్యాయం జరిగేవిధంగా చూస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ఉద్యోగస్తుల ఆశలకు తూట్లు పొడుస్తూ... చేసిన నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులతో వెంటనే చర్చలు జరపాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గణపతిరావు, తమ్మినేని వైకుంఠరావు, గౌరవాధ్యక్షులు మారం కుమారస్వామి, పాలవలస ధర్మారావు, ఖగేశ్వరరావు, బాద నారాయణరావు, డొంకాన పాపారావు, ఎం.రాము, కాపల నారాయణరావు, జగదీశ్వరరావు, గోపి పాల్గొన్నారు.

మందస : పాత తేదీతో జిపిఎస్ అమలు చేస్తూ రాజపత్రాన్ని విడుదల చేయడం దుర్మార్గమని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గున్న రమేష్ అన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ జిఒ ప్రతులను మండల కేంద్రంలో దహనం చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు, పూర్వ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిన్నింటి కొండలరావు, కంసరాన మాధవరావు, జిల్లా కౌన్సిలర్లు తరిణి సోమేశ్వరరావు, గున్న చంద్రశేఖర్, మజ్జి శివకేశ్వరరావు, ధర్మాపు కిరణ్, జె.సోమేశ్వరరావు, మార్పు సుజాత, తెంబ గంగారావు పాల్గొన్నారు.

మందస : ప్రతులను దహనం చేస్తున్న ఉపాధ్యాయులు

సోంపేట : ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని పిఆర్‌టియు సోంపేట, కంచిలి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాలిబందు, చంద్రశేఖర్, శంకర్ తారక్ కోరారు. ఈ మేరకు సోంపేటలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అన్న క్యాంటీన్ల ప్రారంభానికి సన్నాహాలు

- పాత భవనాల్లో కొనసాగించే అవకాశం
- ఒక్కో క్యాంటీన్‌కు రూ.13 లక్షలు కేటాయింపు
- ఆగస్టు 15 నాటికి సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నిరుపేదలకు తక్కువ ఖర్చుతో భోజనం అందించే లక్ష్యంతో గతంలో టిడిపి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. గత వైసిపి ప్రభుత్వం ఈ క్యాంటిన్లు రద్దు చేయడంతో పాటు ఆ భవనాలను ఇతర అవసరాలకు కేటాయించారు. సామాన్యులకు ఈ నిర్ణయం నష్టదాయకమైనది కావడంతో విమర్శలను ఎదుర్కొన్నా... జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. నెలరోజుల క్రితం రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చింది. దీంతో అన్న క్యాంటీన్లను తిరిగి తెరపిస్తామని ప్రకటించింది. బాధ్యతల స్వీకరణ సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ఫైల్‌పై సంతకం చేశారు. గడచిన రెండేళ్లుగా సొంత ఖర్చులతో ప్రస్తుత శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ నగరంలో అన్న క్యాంటిన్ నిర్వహించే వారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆయన తన సొంత ఖర్చులతో అన్న క్యాంటిన్‌ను నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే జిల్లా కేంద్రంలో గతంలో ఏడు రోడ్ల కూడలి వద్ద, పాత బస్టాండ్ వద్ద రెండు క్యాంటీన్లను నిర్వహించేవారు. తిరిగి అదే ప్రదేశాల్లో కాంటీన్లను నెలకొల్పడానికి ప్రభుత్వం అనుమతించింది. పాత క్యాంటీన్లను తిరిగి పునరుద్ధరించడానికి వీలుగా ఆదేశాలు విడుదల కావడంతో గతంలో నిర్వహించిన భవనాల్లో తిరిగి వీటిని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఏడు రోడ్ల కూడలి వద్ద గతంలో నిర్వహించిన అన్న క్యాంటీన్

గత ప్రభుత్వ హయాంలో క్యాంటీన్ భవనాల్లో ఒకటి సచివాలయం గాను, మరొకటి వైసిపి నాయకులకు హోటల్ నడుపుకునేందుకు లీజు కిచ్చారు. వాటినే తిరిగి పునరుద్ధరించడానికి ప్రభుత్వం ఒక్కో దానికి రూ.13 లక్షల వంతున నిధులు ప్రభుత్వం కేటాయించింది. ఆగస్టు 15 నుంచి వీటిని అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

గత నాలుగేళ్లుగా అన్న క్యాంటీన్ల స్థానంలో వార్డు సచివాలయం గాను, ప్రయివేటు హోటళ్లుగా మార్చిన రెండింటినీ తిరిగి పునరుద్ధరించే బాధ్యతలను నగరపాలక సంస్థకు అప్పగించారు. అన్న క్యాంటీన్లుగా ఈ భవనాలను సిద్ధం చేసేందుకు ఒక్కో క్యాంటీన్‌కు రూ.13 లక్షల వరకు ఖర్చు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఒకేసారి 80 మంది భోజనం చేసేలా ఏర్పాట్లు చేయలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. భోజనం, అల్పాహారం నిలుచుకుని తీసుకునే వారికి వీలుగా ఉండేలా స్టీల్ టేబుళ్లను ఏర్పాటు చేయనున్నారు. ప్రధానంగా ఒక్కో క్యాంటీన్లో ఒకేసారి 70 నుంచి 80 మంది వరకు ఆహారం తీసుకునే వీలుంటుంది. అలాగే తాగునీటి సదుపాయం, విద్యుత్ ఆధునికీకరణ పనులు చేపట్టనున్నారు. దెబ్బతిన్న గచ్చుల స్థానంలో కొత్త వాటిని అమరుస్తారు. అన్న క్యాంటీన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఆగస్టు నాటికి పూర్తి స్థాయిలో రంగులు వేసి, బోర్డులు ఏర్పాటు చేసి సిద్ధం చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఆదేశాలు అందాయి. ఆన్‌లైన్ విధానంలో టోకెన్లు తీసుకొచ్చి ఆహార బరువు చూసేందుకు వీలుగా వెయింగ్ యంత్రాన్ని అందుబాటులోకి తీసుకొస్తారు. కౌంటర్లతో పాటు టోకెన్లు జారీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఆన్‌లైన్ పద్ధతిని అమలు చేసేందుకు కంప్యూటర్, నెట్‌వర్కు సిద్ధం చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఆ భవనాల్లోని సచివాలయాన్ని ఎక్కడి మార్చాలన్నది పంచాయతీరాజ్‌శాఖ నుంచి ఉత్తర్వులు అందాల్సి ఉంది.

సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

జర్నలిస్టులకు పెన్షన్ అమలు చేయాలి

ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశాన్ని స్థానిక ఎన్‌జిఒ హోంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని 13 రాష్ట్రాల్లో జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం అమలవుతోందని, ఈ విధానం పరిశీలనకు రాష్ట్రానికి చెందిన అధికారులను పంపాలని కోరారు. అవసరమైతే వారితో పాటు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులూ అవకాశం కల్పించాలన్నారు. కీ.శే వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జర్నలిస్టులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులతో పాటు అందరికీ ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు ఇచ్చిన జిఒ విధానాన్ని అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వాల హయాంలో పాలన చివరి రోజుల్లో ఇళ్ల స్థలాల అంశాన్ని తెరపైకి తేవడం మినహా కార్యరూపం దాల్చలేదని గుర్తుచేశారు. ఇప్పటికైనా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సమగ్ర విధానాన్ని రూపొందించాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో సిసిఎల్ఎ పరిధిలో స్థలాలను ఎంపిక చేసి, జిల్లాల్లో ఉండే జర్నలిస్టులకు స్థలాలు కేటాయించాలన్నారు. కలెక్టర్లు, తహశీల్దార్లకు స్థలాలు ఎంపిక చేసే విధానం తీసుకురావడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని తెలిపారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు, ఇళ్లు, అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని, అక్రిడిటేషన్ కమిటీల్లో జర్నలిస్టు సంఘాలకు స్థానం కల్పించాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలను సమావేశానికి హాజరైన శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌కు వివరించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, తన పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీనిచ్చారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.వేణుగోపాల్ ఆధ్వర్యాన జిల్లా అధ్యక్షులు సదాశివుని కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, బిఎస్‌పి నాయకులు సూర్యనారాయణ, మీడియా జెఎసి కన్వీనర్ ఎస్.జోగినాయుడు, ఎన్ఎజె జాతీయ కార్యవర్గ సభ్యులు సత్తారు భాస్కరరావు, ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు ఎస్.వి రమణ, విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టి.భీమారావు, డి.ఆనందరావు, బి.వాసుదేవరావు, భేరి చిన్నారావు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగుల ప్రతిభ

శ్రీరామ్మూర్తి

విజయకుమారి

టెక్కలి: ఆల్ ఇండియా బస్సు ట్రాన్స్‌ఫోర్టు అథ్లెటిక్ స్పోర్ట్స్ మీట్ ఆధ్వర్యాన సెప్టెంబరులో ఢిల్లీలో నిర్వహించనున్న పోటీల్లో ఆంధ్రా తరుపున పాల్గొనేందుకు ఇద్దరు ఉద్యోగులు ఎంపికైనట్లు టెక్కలి ఆర్‌టిసి డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. విశాఖపట్నంలోని ఆదివారం జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారని పేర్కొన్నారు. ఈ పోటీలో బి.శ్రీరామ్మూర్తి 400 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్, ఆర్.విజయ కుమారి వంద మీటర్ల రన్నింగ్, జావలెంత్రోలో ఎంపికయ్యారని అన్నారు. జోనల్‌స్థాయిలో ఎంపికైన వీరు ఆగస్టు 3న విజయవాడలో జరగ బోవు రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరికి అభినందించారు.

ఆర్‌టిసి సేవలు మరింత మెరుగు

- సమర్థవంతంగా డ్రైవర్ల శిక్షణ
- కార్గో సర్వీసులు వేగవంతం
- జిల్లా ప్రజా రవాణాధికారి కె.విజయ్ కుమార్



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రయాణికులకు ఆర్‌టిసి అందిస్తున్న సేవలు మరింత మెరుగుపరచడానికి చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి కె.విజయ్ కుమార్ తెలిపారు. ఆర్‌టిసి డ్రైవింగ్ స్కూల్ ద్వారా సమర్థవంతమైన డ్రైవర్ల శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాల్లో భాగంగా కార్గో సర్వీసులను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని తెలిపారు. పలు అంశాలను 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వెల్లడించారు.

? ఆర్‌టిసి సేవల్లో మెరుగుదలకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలో మారుమూల ప్రాంతాలకు సైతం ఆర్‌టిసి సర్వీసులు నడుపుతున్నాం. ఆక్యుపెన్సీ తక్కువగా ఉన్న రూట్లలో, రోడ్లు సరిగా లేని ప్రాంతాలకు మినహా అన్ని ప్రాంతాలకు బస్సులు నడుపుతున్నాం. అంతర్రాష్ట్ర సర్వీసుల్లో భాగంగా ఒడిశాతో పాటు తెలంగాణ రాష్ట్రాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నాం. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సులు వేస్తున్నాం. విశాఖ, విజయవాడ, రాజమండ్రి, ఏలూరు, కాకినాడ, రామచంద్రాపురం, అమలాపురం, అనకాపల్లి, భద్రాచలం ప్రాంతాలకు సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. సమయానుకూలంగా నిర్దిష్టమైన వేళల్లో వీటిని నడుపుతున్నాం. సకాలంలో బస్సులు రావడం, ప్రయాణికులను సురక్షితంగా సకాలంలో గమ్యానికి చేర్చుతున్నాం.

? కార్గో సర్వీసులు ఎలా ఉన్నాయి?

సంస్థ ఆదాయం పెంపు కోసం 2017 నుంచి కార్గో విధానాన్ని ఆర్‌టిసి అమల్లోకి తీసుకొచ్చింది. అది విజయవంతం కావడంతో కార్గో డోర్ డెలివరీ విధానాన్ని గత నవంబరు నుంచి అమలు చేస్తోంది. తొలుత ప్రయోగాత్మకంగా శ్రీకాకుళం -1, 2 డిపోలతో పాటు టెక్కలి, పలాస డిపోల్లో కార్గో డోర్ డెలివరీని ప్రవేశపెట్టింది. అన్ని డిపోల పరిధిలో కాంట్రాక్టు విధానంలో కార్గో డోర్ డెలివరీలను ఏజెన్సీలకు అప్పగించింది. ఆ ఏజెన్సీలు కవర్లు, వస్తువులను డోర్ డెలివరీ చేస్తున్నాయి. ఆర్‌టిసి కార్గోలో 50 కేజీల లోపు పార్శిళ్లకు డోర్ డెలివరీ సౌకర్యం కల్పించింది. జిల్లాలో ఉన్న అన్ని ఆర్‌టిసి బుకింగ్ కౌంటర్ల నుంచి ఎంపిక చేసిన ప్రదేశాలకు డోర్ డెలివరీ చేస్తున్నాం.

? కార్గో సర్వీసులకు ప్రజాదరణ ఎలా ఉంటోంది?

ప్రైవేటు కార్గో సర్వీసుల కంటే ఆర్‌టిసి సేవలు చౌకగా అందించడంతో అందరికీ అందుబాటులో ఉన్నాయి. డోర్ డెలివరీ చేసేందుకు కేజీ లోపు రూ.18, కేజీ నుంచి ఆరు కేజీల వరకు రూ.30, 10 కేజీల వరకు రూ.36, 10 నుంచి 25 కేజీల వరకు రూ.48, 50 కేజీల వరకు రూ.50 వసూలు చేస్తున్నాం. ప్రస్తుతానికి 50 కేజీల వరకే డోర్ డెలివరీ అవకాశం ఉంది. కార్గో సెంటర్ల పరిధిలో పది కిలోమీటర్ల వరకు మాత్రమే డోర్ డెలివరీ చేస్తున్నాం. ప్రజల నమ్మకం, ఆదరణ వల్లే అనుకున్న లక్ష్యాలను అందుకోగలుగుతున్నాం. 2017లో పార్సిల్ లాజిస్టిక్ వ్యాపారం ప్రారంభమై, ఇప్పుడు అన్నిరకాల సేవలు అందుబాటులోకి తీసుకురావడమైంది.

? డ్రైవింగ్ స్కూల్‌ను నిర్వహణ ఎలా సాగుతోంది?

జిల్లాలో శ్రీకాకుళం కేంద్రంగా ఆర్‌టిసి డ్రైవింగ్ స్కూల్‌ను నిర్వహిస్తున్నాం. ఒక్కో బ్యాచ్‌లో 16మందికి శిక్షణ ఇస్తున్నాం. ఇంతవరకు 16 బ్యాచ్‌లు శిక్షణ పూర్తయింది. శిక్షణ తీసుకున్న వారికి సర్టిఫికేట్‌తో పాటు హెవీ లైసెన్స్‌ను రవాణా శాఖ ద్వారా అందిస్తున్నాం. ఇక్కడ చేరిన వారికి ఒక్క డ్రైవింగ్ మాత్రమే కాకుండా మెకానికల్ వర్కు నేర్చుకునేందుకు వీలుంటుంది. శిక్షణ కోర్సు పూర్తి చేసుకున్న వారికి ఆర్‌టిసిలో గానీ, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు పొందడానికి వీలుంది.

వినతిపత్రం అందజేస్తున్న బీమామిత్రలు

సిఎంను కలిసిన బీమామిత్రలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు చంద్రన్న బీమామిత్రలుగా సేవలు అందించామని, వైసిపి ప్రభుత్వంలో తమని తొలగించారని బీమామిత్ర సునీత పట్నాయక్ తెలిపారు. మంగళగిరిలో సిఎం చంద్రబాబు నాయుడును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేసి... తమ ఆవేదనను వ్యక్తం చేశారు. మళ్లీ టిడిపి అధికారంలో రావడంతో తమ ఆశలు చిగురించాయని అన్నారు. తమను మళ్లీ విధిల్లోకి తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో 18 వందల మంది చంద్రన్న బీమామిత్రులు ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో కళ్లని గుణవతి, మేరి, ఈశ్వరి, సోమేశ్వరి, కుమారి, అరుణ, కళావతి, సుజాత, వెంకటమ్మ పాల్గొన్నారు.

రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీహరి తదితరులు

'పాత పెన్షన్'కు కృషి చేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఉద్యోగులకు పాత పెన్షన్ వర్తించే విధంగా కృషి చేయాలని 2003 డిఎస్‌సి పోరం జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీహరి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు జిల్లా కేంద్రంలో ఆయన స్వగృహంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57ను అమలు చేయడం ద్వారా 2003 డిఎస్‌సి ద్వారా ఎంపికైన సుమారు 7 వేల మంది ఉపాధ్యాయులతో పాటు పోలీస్ గ్రూప్ ఉద్యోగులు మొత్తం కలిపి రాష్ట్రవ్యాప్తంగా 10 వేల పైచిలుకు ఉద్యోగులు పాత పెన్షన్ కోల్పోతున్నారని, వారికి న్యాయం చేయాలని రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ప్రభుత్వంతో చర్చించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన వారికి పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

మహా మాధురి ట్రస్టు ప్రారంభం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలం గురుగుబిల్లిలో మహా మాధురి చారిటబుల్ ట్రస్ట్ నూతన ప్రారంభోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా మాధురి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు దండాసి రాంబాబు (జాను), అప్పలసూరి మాస్టర్ నిర్వహణలో జరిగిందని, ఈ ట్రస్ట్ విద్య, వైద్యం, పర్యావరణం, సామాజిక అంశాలపై ప్రజల్లో చైతన్యవంతం చేయడానికి ఉపయోగ పడడం సంతోషదాయకమన్నారు. ఈ రక్తదాన శిబిరంలో 43 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ రక్తం ఎందరో ప్రాణాలు నిలవడానికి దోహద పడుతుందని, యువకులు ముందుండి మరిన్ని సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాల్లో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు క్రాంతి శ్రీ, మెంటాడ స్వరూప్, ముప్పిడి సురేష్, దళిత సంఘాల నాయకులు రాంగోపాల్, డి.గణేష్, సీనియర్ అడ్వకేట్ మురళీకృష్ణ, చలపతిరావు, గ్రామ యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గాయనీ గాయకులను సత్కరిస్తున్న ప్రతినిధులు

అలరించిన సినీ సంగీత విభావరి

శ్రీకాకుళం: విశాఖపట్నానికి చెందిన నారీభేరి సంగీత సంస్థ, కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యాన నగరంలోని ఎన్‌జిఒ హోంలో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి సంగీత ప్రియులను అలరించింది. 'సంధ్యా వేళ సరాగాల హేల' పేరిట ప్రముఖ గాయని కింతలి భాగ్యలక్ష్మి నేతృత్వాన గాయనీ గాయకులు శైలజ మెరాజ్, పుండరి కుమార్, కింతలి సూర్యప్రకాష్, చింతా వెంకటేశ్వరరావు, భూషణ్, రామ్మోహనరావు ఆపాత మధుర గీతాలను ఆలపించారు. రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొంక్యాన మురళీధర్, డాక్టర్ నిక్కు అప్పన్న, కొంక్యాన వేణుగోపాల్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొంక్యాన ట్రస్ట్ తరుపున గాయనీ గాయకులను సత్కరించారు. కార్యక్రమంలో వికాస తరంగిణి జిల్లా కన్వీనర్ ఎం.ఉషశ్రీ, జెసిఐ ప్రతినిధి బి.వరలక్ష్మి, కళారంగ ప్రముఖులు, పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల మనోభావాలను కించపర్చొద్దు

ప్రజాశక్తి- ఆమదాలవలస

బ్రాహ్మణుల మనోభావాలను కించపరచవద్దని బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు బలిజేపల్లి వెంకట రమణమూర్తి అన్నారు. ఆదివారం పట్టణంలోని మెట్టక్కివలసలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన పైలా దాసు సామాజిక మాధ్యమాల్లో స్మార్త వైదిక బ్రాహ్మణ జాతిని పరుష పదజాలంతో కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను బ్రాహ్మణ సంఘం తరపున ఖండిస్తున్నట్లు తెలిపారు. పైలా దాసు బ్రాహ్మణులను వేశ్య పుత్రులని అభివర్ణించడంతో బ్రాహ్మణుల మనోభావాలు దెబ్బ తినడమే కాకుండా తీవ్ర ఆవేదనకు గురయ్యామన్నారు. బ్రాహ్మణులు సమాజంలో అన్ని సామాజిక వర్గాలను కలుపుకుంటూ వివక్షలకు తావివ్వకుండా ఏకీకృత భావంతో మసలు తున్నారని, ఇటువంటి నీచమైన పదజాలంతో బ్రాహ్మణులను నిందించడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమన్నారు. పైలా దాసు వెంటనే బ్రాహ్మణులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బ్రాహ్మణ సంఘ కార్యదర్శి రమణ, ఉపాధ్యక్షులు బలివాడ చిట్టి పంతులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆర్థికసాయం

ప్రజాశక్తి- లావేరు

మండలం గుమ్మడాం పంచాయతీ నాగంపాళెంలో నూతనంగా నిర్మిస్తున్న అంబేద్కర్ విగ్రహానికి అదే గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకుడు మజ్జి రామూర్తి ఆదివారం రూ. 26 వేలు ఆర్థికసాయం అందించారు. సార్వత్రిక ఎన్నికల్లో యువత కోరిక మేరకు హామీ ఇచ్చిన రామూర్తి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చారు. మాజీ సర్పంచ్ మజ్జి సత్యం చేతులమీదగా నగదును అందజేశారు. భవిష్యత్‌లో గ్రామాభివృద్ధికి తన సహకారాన్ని అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎం.రామూర్తి, జె.రమణ, దుర్గాప్రసాద్, గొర్లె శ్రీను, మజ్జి అప్పలనాయుడు, యువత తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం.. విష సర్పాలతో జరభద్రం

పాముకాటుకు గురవుతున్న రైతులు

ప్రజాశక్తి- బూర్జ

వర్షాకాలం వేళ.. జిల్లా వాసులను పాముల భయం వెంటాడుతోంది. జిల్లాలో పాముకాటు బాధిత మృతులు పెరుగుతున్నారు. అందులో చాలామంది మృత్యువాత పడ్డారు. ప్రస్తుత వర్షాకాలంలో గ్రామీణ ప్రాంతాలు, పొలాల్లో తాచుపాము, కట్లపాము, రక్తపింజరి, చంద్రపొడ తదితర విషసర్పాలు అధికంగా సంచరిస్తున్నాయి. రైతులు వ్యవసాయ పనుల్లో నిగ్నమైనప్పుడు కాటు వేస్తున్నాయి. సకాలంలో వైద్యం అందక కొంతమంది ప్రాణాలు

కోల్పోతున్నారు. ఎక్కువ శాతం మంది నాటువైద్యంపై ఆధారపడి ప్రాణాలు కాపాడే విలువైన సమయాన్ని చేజేతులా జారవిడుస్తున్నారు. సిహెచ్‌సిలతో పాటు ఏరియా ఆస్పత్రుల్లో యాంటీవినమ్ అందుబాటులో ఉన్నప్పటికీ అది మొదటి 5-10 డోసులకే పరిమిత మవుతోంది. తరువాత బాధితులను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించాల్సి వస్తోంది. చికిత్స ఆలస్యం కావడం, విషం తీవ్రత బట్టి డోసుల మోతాదు మారుతూ ఉంటుంది. కొందరు పాముకాటు బాధితులు ప్రాణాపాయం నుంచి బయటపడినా పూర్తిస్థాయి డోసులు పడక దీర్ఘకాలిక వ్యాధులకు గురవుతున్నారు. పక్షవాతం, మెదడులో రక్తం గడ్డకట్టడం, అంధత్వం, నాడీ వ్యవస్థ దెబ్బతినడంతో పాటు గుండె, కాలేయం పనితీరుపై ప్రభావం చూపే రుగ్మతల బారిన పడుతున్నారు. పాము కాటుకు గురైన బాధితుడికి మూడుగంటల్లోపు శరీరంలో విష తీవ్రత బట్టి యాంటీవినమ్ డోసులను అందిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చు. ఆపై దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా అడ్డుకట్ట వేయవచ్చు.

పాము కాటు లక్షణాలు, చికిత్స

పాము కాటుకు గురైన మనిషి శరీరం వెంటనే చల్లగా మారిపోతుంది ఛాతీలో విపరీతమైన నొప్పి రావడంతో పాటు ఆయాసం వస్తుంది. నోటి వెంట నురగలు వస్తాయి. పాముకాటుకు గురైన వ్యక్తికి కంగారు పెట్టరాదు. ఆందోళనకు గురైతే విషం వేగంగా శరీరమంతా వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది.

ఇవి చేయాలి

- పాముకాటు బారినపడకుండా ఉండాలంటే ఇంటి పరిసరాలు, పశువుల శాలలు శుభ్రంగా ఉంచుకోవాలి.
- మట్టి, పెంకుటిళ్లకు ఎక్కడా రంధ్రాలు లేకుండా చూసుకోవాలి.
- ధాన్యం రాశులు, సంచులు తదితర వాటిలో మురుగు లేకుండా చూసుకోవాలి.
- పుట్టలు, గుట్టలు దగ్గర పిల్లలు ఆటలు ఆడరాదు.
- రాత్రివేళల్లో బయటకు వెళ్లినప్పుడు టార్చ్‌లైట్లు వేసుకోవాలి. చేతికర్ర వెంట పట్టుకోవాలి.
- రైతులు పొలాలకు వెళ్లేటప్పుడు గట్లుపై కర్రతో చప్పుడు చేసుకుంటూ వెళ్లాలి. మోకాళ్లవరకు ఉండే రబ్బరు బూట్లును వాడాలి.

అప్రమత్తంగా ఉండాలి

పాముకాటు వేస్తే మూడు గంటల్లోపు యాంటీ వీనమ్ డోసు వేయాలి. నాటు వైద్యం అత్యంత ప్రమాదకరం. ఆస్పత్రికి తీసుకెళ్లడంలో ఆలస్యం చేస్తే ప్రాణాలకే ముప్పు. అన్నింటికీ మించి బాధితుడు ధైర్యంతో ఉండాలి. పాముకాటు వేసిన వెంటనే విష ప్రసారం జరగ కుండా అడ్డుకట్ట వేయాలి. తాడుతో గాయాన్ని కట్టి వేయాలి. ప్రభుత్వాస్పత్రిలో యాంటీ వీనమ్ డోసులు అందుబాటులో ఉంటాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి.

- ఐ.పావని, వైద్యాధికారి, బూర్జ

తలనొప్పిగా నామినేటెడ్ పదవులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత పార్టీ విజయానికి కృషి చేసిన కార్యకర్తలకు సరైనా గుర్తింపు ఇవ్వాలని టిడిపి, జనసేన, బిజెపి పార్టీలో నిర్ణయించుకున్నాయి. దీంతో ప్రతి నియోజకవర్గంలో తమ తమ పార్టీలకు చెందిన పెద్ద నాయకులు కష్టపడిన కిందిస్థాయి నాయకుల జాబితా సేకరణలో కసరత్తులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నామినేటెడ్ పదవులు ఎవ్వరికి ఇవ్వాలి, అందులో ముందుగా జనసేన, బిజెపి నాయకుల జాబితా, తరువాత సొంత పార్టీలో నాయకులు పేర్లు కసరత్తు చేస్తున్నారు. ముందుగా జనసేన నుంచి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, ఆ తర్వాత ఇదే పార్టీలో ముఖ్య నాయకులు తిప్పన దుర్యోధనరెడ్డి, బైపల్లి ఈశ్వరరావు, నాగుల హరిబెహరా, పోటీ పడుతున్నారు. వీరందరూ టిడిపి కూటమి విజయానికి విశేషంగా కృషి చేశారు. ఇక సొంత పార్టీలో టిడిపి నేతలు తీవ్రంగా పోటీ పడుతున్నారు. నామినేటెడ్ పదవుల కోసం కొంతమంది తరగతి కార్డు ఉపయోగిస్తూ... మంత్రులు, పార్టీ పెద్దల ఆశీసుల ప్రయత్నిలు కొనసాగిస్తున్నారు. ఎవ్వరు ఎక్కడకి వెళ్లి సిఫార్సు చేసినా చివరికి స్థానిక ఎమ్మెల్యే అశోక్ గ్రీన్‌సిగ్నల్ లేనిదే నామినేటెడ్ పదవులు దక్కవు. గత వైసిపి ప్రభుత్వం ఈ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టిసారించారు. దీంతో అనేక నామినేటెడ్ పదవులు దక్కిందాయి. అదేబాటలో నామినేటెడ్ పదవులు వస్తాయని ఎదురు చూస్తున్న నేతలకు టిడిపి కూటమి ప్రభుత్వం అదేస్థాయిలో పదవులు ఇచ్చే అవకాశం లేదని పార్టీలో సీనియర్ నేతలు స్పష్టం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరపున నిలబడే అవకాశం ఉన్నా నేతలకు, పార్టీ నూతన కార్యవర్గంలో కీలక పదవులు లభించే నాయకులకు వేర్వేరుగా జాబితాలు సిద్ధం చేసుకుంటున్నారు. సామాజిక సమీకరణాలు, కూటమి నేతల సహకారాలన్నీ పరిగణలో తీసుకుని నామినేటెడ్ పదవులు కట్టబెట్టే పనిలో ఎమ్మెల్యే ఉన్నారు. టిడిపిలో నామినేటెడ్ పదవులు కోసం ఆశ పడుతున్న నేతల్లో టిడిపి పట్టణ అధ్యక్షులు కాళ్ల ధర్మారావు, రాష్ట్ర కార్యదర్శి సాలీనా ఢిల్లీయాదవ్, బిసి సాధికారిత సమితి కన్వీనర్ కొండ శంకర్‌రెడ్డి చూస్తున్నారు. ఇంకా కవిటి, కంచిలి, సోంపేట మండలాల్లో నామినేటెడ్ పదవుల కోసం పార్టీ క్యాడర్ ఎదురుచూస్తుంది. మొత్తం నామినేటెడ్ పదవులు భర్తీలో ఎమ్మెల్యేకి పెద్ద తలనొప్పిగా తయారైంది.

చిత్రపటాన్ని అందజేస్తున్న చక్రవర్తి

అరసవల్లి సందర్శించిన ఎమ్మెల్యే గురజాల

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని ఆదివారం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన నాయుడు సందర్శించారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆలయంలో నిర్వహించే స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సీనియర్ సహాయకులు బి.ఎస్.చక్రవర్తి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

ఆదాయం రూ.4.64 లక్షలు

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి ఆదివారం సందర్శకుల తాకిడి పెరడంతో రూ.4.64 లక్షల ఆదాయం సమకూరింది. టికెట్లు విక్రయాల ద్వారా రూ.2,10,500, విరాళాల రూపంలో రూ.75,113, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1,78,995 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇఒ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.

పనులను పరిశీలిస్తున్న వల్లభరావు

'శిరీషకు రుణపడి ఉంటాం'

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఈ ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో వంశధార నీరు అందించడానికి కృషి చేసిన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు రైతులు రుణపడి ఉంటారని టిడిపి మండల పార్టీ నాయకుడు దుంపల వల్లభరావు అన్నారు. వంశధార కాలువ 60 ఆర్ఎల్ పరిధిలో ఐదు రోజుల పాటు పూడికతీత పనులు చేపట్టి ఆదివారం సాగునీరు విడిచి పెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్లగా వంశధార శివారు భూములకు సాగునీరు రైతులు చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార 60 ఆర్ఎల్ కాలువ పరిధిలోని పెద్దబొడ్డపాడు రామసాగరం, సీతాపురం ఎర్రచెరువు సాగునీరు అందక ఐదేళ్లగా బోసిపోయి ఉండేవి అన్నారు. అప్పటి వైసిపి పాలకులు వంశధార శివారు ప్రాంతానికి సాగునీరు అందించడానికి కనీస ప్రయత్నం చేయలేదని ఆరోపించారు. ఆగస్టులో సాగునీరు ఇస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే శిరీష జులై నెలలోనే సాగునీరు అందేలా కృషి చేశారని తెలిపారు. రైతులపై రైతు సమస్యలపై ఆమెకు ఉన్న చిత్తశుద్ధికి సకాలంలో సాగునీరు అందించడానికి కృషి చేయడమే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో తమ్మినాన బాలకృష్ణ, టి.మోహనరావు, ఉప్పాడ సురేష్ పాల్గొన్నారు.

అలుపెరుగని పోరాటం

కవిటి: తరగతి ధ్రువీకరణ పత్రాలు, తమ భవిష్యత్ భరోసా కోసం బెంతు ఒరియాలు కవిటిలో సాగిస్తున్న అలుపెరుగని పోరాటం 201వ రోజుకి చేరుకుంది. అందులో భాగంగా ఆదివారం దీక్షలో తులసిగాం యువత, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అలాగే జనసేన పార్టీ ఇచ్ఛాపురం మండల అధ్యక్షులు దుర్యాసి నీలవేణి దీక్షలో పాల్గొని తన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు గుర్తింపు లభించే వరకూ, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

దీక్షల్లో పాల్గొన్న తులసిగాం ప్రతినిధులు

గరిమెళ్ల పోరాట స్ఫూర్తి నేటితరానికి ఆదర్శం

ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గరిమెళ్ల పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం కావాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్ఎజె జాతీయ నాయకులు జి.ఆంజనేయులు పేర్కొన్నారు. నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర సమరయోధుల స్మృతి వనంలో స్వాతంత్ర సమరయోధులు, ప్రజా కవి గరిమెళ్ల సత్యనారాయణ జయంతి వేడుకలు కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై గరిమెళ్ల విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో గరిమెళ్ల రచనలు, పాటలు, అక్షర రూపంలో ప్రధాన భూమిక పోషించారన్నారు. స్వాతంత్ర సమరంలో గరిమెళ్ల, అనంతరం జర్నలిస్టు ఉద్యమంలో మానుకొండ చలపతిరావు కీలకంగా వ్యవహరించారని గుర్తు చేశారు. ఇటువంటి స్ఫూర్తినిచ్చే వారికి శ్రీకాకుళం జిల్లా జన్మనిచ్చిందన్నారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం మాజీ

నివాళ్లర్పిస్తున్న నాయకులు

పాలకమండలి సభ్యులు డాక్టర్ జామి భీమశంకర్, ఇంటక్ ప్రతినిధి వావిలపల్లి జగన్నాథ నాయుడు, ట్రస్ట్ ప్రతినిధి కొంక్యాన వేణుగోపాల్, ఎపిడబ్ల్యుజె విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో తెలుగు పండితులు అవధాని పైడి హరనాథ్ గరిమెళ్లపై పలు గీతాలను ఆలపించారు. కొంక్యాన ట్రస్ట్ చైర్మన్ కొంక్యాన మురళీధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు ఎంవిఎస్ఎస్ శాస్త్రి, నక్క శంకరరావు, తర్లాడ అప్పలనాయుడు, ఎపిడబ్ల్యుజెఎఫ్ విశాఖ జిల్లా ప్రతినిధులు జి. శ్రీనివాస్, డి.రవికుమార్, కొండబాబు, కొంక్యాన శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న సిఐ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రతి వాహనదారుడూ హెల్మెట్ ధరించాలని సిఐ టి.ఇమ్మాన్యుల్‌రాజు అన్నారు. మండలంలోని కేదారిపురంలో హెల్మెట్ వాడకంపై ఆదివారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా స్వేచ్ఛ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ డైరెక్టర్, గ్రామీణ నీటి సరఫరా ఇంజినీర్ అధికారి కె.విష్ణుమూర్తి, అదనపు డైరెక్టర్ ప్రత్యూష విష్ణుమూర్తి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు డి.హరిచంద్ర అవగాహన కల్పిస్తూ... ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనాల డ్రైవింగ్ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కోరారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ సత్యనారాయణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రవి, సంతోష్, బలరాం, మదు బెహరా, కుమారి, దివ్య పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న సిఐ ఇమ్మాన్యుల్‌రాజు

బూర్జ: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని ఎస్ఐ జి.వి.ప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని కొల్లివలస జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేని ద్విచక్ర వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. అలాగే వాహనదారుల వద్ద సరైన పత్రాలు లేని వారికి కూడా అపరాధ విధించారు. మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వకూడదన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, బైక్ నడిపేటప్పుడు అవసరమైన పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. ఈయనతో పాటు కానిస్టేబుళ్లు సూర్యనారాయణ, హేమంత్ ఉన్నారు.

రైతుల ప్రయోజనమే ప్రధానం

ఆమదాలవలస: మండలంలో గత ఐదేళ్ల వైసిపి పాలనలో వివిధ అక్రమాలకు పాల్పడిన వైసిపి నాయకులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని టిడిపి మండల అధ్యక్షులు, కణుగులవలస సర్పంచ్ నూక సూరప్పలనాయుడు (రాజు) డిమాండ్ చేశారు. ఆదివారం కణుగులవలసలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలనలో సిఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్ రైతు సంక్షేమం, వారి ప్రయోజనానికి కృషి చేస్తుంటే చోటా వైసిపి నాయకులు టిడిపిని విమర్శించడం సిగ్గు చేటన్నారు. గ్రామంలో ప్రభుత్వ కార్యాలయ నిర్మాణానికి స్థలం ఇచ్చిన వ్యక్తి స్థలదాత అవుతారని, ఐదు సెంట్లు తక్కువ రేటు గల స్థలం ఇచ్చి ఆమదాలవలస పట్టణ సమీపంలో రూ.లక్షల విలువ చేసే పది సెంట్లు స్థలాన్ని తీసుకున్న వ్యక్తి రైతు భరోసా కేంద్రం హోర్డింగులపై స్థలదాతగా ఉండటంపై గ్రామ ప్రజలు, రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని, అధికారికంగా పంచాయతీరాజ్ శాఖ, వ్యవసాయశాఖకు గాని అప్పగించని ఆ కార్యాలయానికి వెళ్ళడానికి ప్రజలు, రైతులు నిరాకరిస్తున్నారన్నారు. గ్రామంలో వైసిపి పాలనలో ఎన్నో అవినీతి అక్రమాలు జరిగాయని వాటిపై విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసి విచారణ చేయిస్తామన్నారు. గ్రామంలో రైతులకు ఎరువులను పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు.

వాకర్స్ మూలనిధికి విరాళాలు

శ్రీకాకుళం అర్బన్: వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ అభివృద్ధికి ప్రతిఒక్కరూ తోడ్పాటు అందించాలని జిల్లా స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు జి.ఇందిరా ప్రసాద్, పీజీ గుప్తా, బి.వి.రవిశంకర్, ఎస్. జోగినాయుడు కోరారు. ఆదివారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో క్లబ్ ఆధ్వర్యాన మహాత్మా గాంధీ ఫెలోషిప్ సభ్యులు సింహాద్రి వేణుగోపాల్ కుమారుడు వివేక్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో వాకర్స్ క్లబ్‌లు 1575 ఉన్నాయని, వీటి పరిధిలో వేలాది మంది సభ్యులు ఉన్నారన్నారు. మహాత్మా గాంధీ ఫెలోషిప్ పరిధిలో ప్రతిఒక్కరూ చేరాలని, తద్వారా సామాజిక సేవలు సమాజానికి అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం తైక్వాండో నేర్చుకుంటున్న పిల్లలకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో స్టార్ మహిళా నడక సంఘం అధ్యక్షురాలు గేదెల లక్ష్మీ, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు బి.దేవీ ప్రసాద్, సింహాద్రి వేణుగోపాల్, గోలీ ఉమా మహేశ్వరరావు, డాక్టర్ జి.ఎన్.రావు పాల్గొన్నారు.

ఏ క్షణంలోనైనా...

కవిటి: మండలంలోని నెలవంక ప్రాథమిక, ఉన్నత పాఠశాలల సముదాయంలో ప్రమాదకరంగా ఉన్న తాగునీటి సరఫరా ట్యాంకు ఉంది ఎప్పుడు కూలి ఏ ప్రమాదం జరుగుతుందోనని అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి ట్యాంకు ఆధారమైన నాలుగు పిల్లర్లలో రెండు పిల్లర్లు అడుగు భాగం పూర్తిగా పెచ్చులూడి పటుత్వం కోల్పోయాయి. దీంతో పైన ఉన్న భారం కేవలం రెండు పిల్లర్లపైనే పడుతోంది. దీంతో ఉపాధ్యాయులు గ్రామస్తులు, పంచాయతీ పెద్దలకు విషయం తెలియజేసి దీన్ని తొలగించేందుకు గ్రామంలో తీర్మానం కూడా చేశారు. కానీ, ఇంతవరకు పనిమాత్రం జరగలేదు. దీంతో విరామ సమయంలో, సాయంత్రం వేళల్లో అదే ప్రదేశంలో పిల్లలు ఆడుకుంటుంటారని, చూస్తుంటే భయంగా ఉంటుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అధికారులు, ప్రజా ప్రతినిధులు శిథిలావస్థలో ఉన్న తాగునీటి ట్యాంకును తొలగించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

శిథిలావస్థలో ఉన్న ట్యాంకు పిల్లర్లు

శివకుమార్ మృతదేహం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని బొప్పాయిపురం-అక్కువరం మధ్యలో ఉన్న జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. ఈ ప్రమాదంలో హైదరాబాద్ చెందిన బియ్యాని శివకుమార్ (50) అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా... వెనక నుంచి లారీ బలంగా ఢీకొనడంతో త్రీవంగా గాయపడ్డారు. వెంటనే హైవే సిబ్బంది అంబులెన్స్ లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. ఎఎస్ఐ కేశవరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్ : మండలంలోని సీతాపురం పంచాయతీ ఒలేసాగరానికి చెందిన మాలతి ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాల్లోకి వెళ్తే... గతకొంత కాలంగా కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైంది. దీంతో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగేంది. గమనించి స్థానికులు వెంటనే స్థానిక టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడకు చెందిన ఆరుగురు జూదర్లను అరెస్టు చేశామని నౌపడ ఎస్ఐ కిషోర్‌వర్మ ఆదివారం తెలిపారు. కొద్ది రోజులుగా పేకాట ఆడుతున్న సమాచారం రావడంతో దాడులు నిర్వహించామని అన్నారు. ఈ దాడుల్లో రూ.26 వేలు నగదు, ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

స్వాధీనం చేసుకున్న నాటుసారా సామగ్రి

నాటుసారా స్వాధీనం

మెళియాపుట్టి: మండలంలోని సవరముకుందపురంలో టెక్కలి సెబీ ఎన్‌ఫోర్స్‌మెంట్, పలాస డిటిఎఫ్ సిబ్బంది సారా తయారీ స్థావరాలపై ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అలాగే 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నాటు సారా వల్ల కలిగే నష్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెబీ సిఐ జి.రాజశేఖర్ నాయుడు, పలాస డిటిఎఫ్ సిఐ పి.రామ చంద్ర కుమార్, మెళియాపుట్టి ఎస్ఐ టి.రాజేష్ పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

40 మంది రక్తదానం

పలాస : కాశీబుగ్గ సూదికొండ కాలనీ యువకులు ఆదివారం ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. టెక్కలి జిల్లా ఆస్పత్రి వైద్యాధికారి సునీత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం 40 యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ యువత రక్తదానం చేయాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో శివకుమార్, అశోక్‌కుమార్, మీడియా అప్పన్న, సురేష్, తిరుపతిరావు పాల్గొన్నారు.

కొత్తవలస జెసిబితో తవ్విస్తున్న గొయ్యి

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని వంశధార, నాగావళి నదీ ప్రాంతాల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు చేపడతామని తహశీల్దార్ కె.వేణుగోపాలరావు అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తవలస వద్ద నాగావళి నదీ ప్రాంతం నుంచి రాత్రి సమయంలో ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తున్నారని కొందరు ఫిర్యాదు చేయడంతో తహశీల్దార్ స్పందించి నదీ ప్రాంతానికి వెళ్లే రహదారిలో జెసిబిలతో ఎటువంటి వాహనాలు వెళ్లకుండా పెద్దపెద్ద గోతులను తీయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు బండ్ల ద్వారా ఎవరైనా ఇసుక రవాణా చేసుకోవచ్చని, అయితే సంబంధిత పంచాయతీ కార్యదర్శి అనుమతి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎం.శిరీష, విఆర్ఒ రాంబాబు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న యువకులు

ప్రయాణికుల నీడ కోసం...

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని బెండి గేటు కూడలి, జాతీయ రహదారి సమీపంలో అనంతగిరి బస్టాండ్ వద్ద ఆదివారం మొక్కలు నాటారు. ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉంటారు. ఎటువంటి ఆసరా లేకపోవడంతో మండు టెండలోనే వేచి ఉండే పరిస్థితి. దీంతో స్థానిక యువకులు మొక్కలు నాటడానికి ముందుకొచ్చారు. ఎక్కువ నీడను ఇచ్చే మర్రి, రావి మొక్కలను లొద్దభద్రకు చెందిన పర్యావరణవేత్త కొత్తపల్లి చిన్నాచారి సమకూర్చారు. కార్యక్రమంలో ఉంగ భుజింగరావు, నీలాపు కృష్ణారావు, బందాపు తిరుమల, రంది పోలయ్య, జనపాన గనేష్‌రెడ్డి, దాసరి సింహాచలం, లక్కోజు ప్రకాష్, ఠాగూర్, జగదీష్, వంశి తదితరులు పాల్గొన్నారు.